వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ సంక్షేమ సంఘం నేతలు

లాలాపేట: నిరుద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దునుకు వేలాద్రి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలువురు నిరుద్యోగ ప్రతినిధులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసారు. ఉద్యోగాల భర్తీలో నిరుద్యోగుల వయోపరిమితిని 44 నుంచి 50 సంవత్సరాలకు సడలించి ఒకే ఒక్కసారి ఉద్యోగ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉద్యోగ పోటీ పరీక్షలకు గత ప్రభుత్వం గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 44 సంవత్సరాలకు సడలించినా ఆ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల ప్రదర్శించిన నిర్లక్ష్యంతో నోటిఫికేషన్లు సకాలంలో వేయకపోవడంతో ఎలాంటి ఫలితం పొందలేకపోయామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలలో చేసిన జాప్యం కారణంగా ఉద్యోగాలకు గరిష్ఠ వయస్సును 49కి పెంచాలని 2022, జూన్ 17న రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వులను సైతం గత ప్రభుత్వం ఏమాత్రం లెక్క చేయలేదన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని సీఎంకు వివరించారు. వినతి ఇచ్చిన వారిలో మంజులారెడ్డి, నర్సింహులు, వెంకటనారాయణ, రవీంద్ర, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, పలు జిల్లాలకు చెందిన నిరుద్యోగులు ఉన్నారు.

వ్యాపారులతో సమన్వయం చేసుకుంటూ
ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి



అమీర్‌పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: వ్యాపారులతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేటకు చెందిన వ్యాపారులు ఇటీవల ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించగా గురువారం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, ఇతర అధికారులతో కలిసి కనకదుర్గ దేవాలయం నుంచి సత్యం థియేటర్ చౌరస్తా వరకు పర్యటించారు. షాపుల ముందు మార్కింగ్ ఏర్పాటు చేసి అందులో మాత్రమే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర వాహనాలను గురుద్వారా సమీపంలోని నాలాపై నిలుపుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తోపుడు బండ్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తలసాని దృష్టికి తీసుకువచ్చారు. చిరు వ్యాపారుల కారణంగా వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా క్రమం పద్ధతిలో వ్యాపారులు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. శేషుకుమారి, గుర్మీత్‌సింగ్, అశోక్, గులాబ్‌సింగ్, ఉత్తమ్, ఎం.లలితగోపీచౌహాన్, కూతురు నర్సింహ, కట్ట బల్‌రాం పాల్గొన్నారు.

చేతి వృత్తులు, హస్తకళాకారుల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

రసూల్‌పురా: చేతి వృత్తులు, హస్తకళాకారుల్లో నైపుణ్యం పెంపొందించడంతో పాటు వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు సీఎం విశ్వకర్మ పథకం పటిష్ట అమలుకు కృషి చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మధుసూదన్ పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదన్ మాట్లాడుతూ.. కళా నైపుణ్యం పెంపుదల, చేతి వృత్తుల వారందరికి మేలు జరగాలనేది పీఎం. విశ్వకర్మ పథకం ముఖ్య ఉద్దేశమని ఈ పథకంలో కార్పెంటర్, బోట్ మేకర్, కమ్మరి, గోల్డ్‌స్మిత్, టైలర్, టాయ్ మేకర్, బార్బర్ ఇలా 18 సంప్రదాయ వ్యాపారాలు చేర్చబడ్డాయని చేతివృత్తులు, హస్త కళాకారులు తమ పేర్లను నమోదు చేసుకుంటే వారి నైపుణ్యాలను మెరుగుపర్చడానికి తగిన శిక్షణ ఇస్తారన్నారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా గుర్తింపు కార్డు, రూ. 15 వేల విలువ చేసే టూల్ కిట్, మొదటి విడత రూ. లక్ష రుణ సదుపాయం అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. సుమతి, తెలంగాణ చాప్టర్ కోవే అధ్యక్షురాలు చేతనాస్ జైన్, అడ్వైజరీ సభ్యులు కరుణ గోపాల్, ఎంఎంఈ అదనపు డెవలప్‌మెంట్ కమిషనర్ చంద్రశేఖర్, స్కిల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ డైరక్టర్ ఉపేంద్ర రావు, డీఐసీ జనరల్ మేనేజర్ ప్రీతి పవన్ కుమార్ పాల్గొన్నారు.

సిల్ట్‌గ్రాబర్ వాహనం పనితీరు బాగుంది



వాహనం పనితీరును పరిశీలిస్తున్న డీజీఎం కృష్ణ, కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: కార్మికుల అవసరం లేకుండా సివరేజీ పైప్‌లైన్ల నుంచి మట్టితో పాటు చెత్త చెదారాలను బయటకు తీసేందుకు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన సిల్ట్‌గ్రాబర్ వాహనం పనితీరు బాగుందని జలమండలి మారేడుపల్లి డీజీఎం కృష్ణ అన్నారు. సీతాఫల్‌మండి బ్రాహ్మణబస్తీలో గురువారం సిల్ట్‌గ్రాబర్ వాహనాన్ని వినియోగించి డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా డీజీఎం కృష్ణ, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ.. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో దిగి కార్మికులు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు జరిగాయని, అలాంటి అవాంఛనీయ ఘటనలను చెక్ పెట్టేందుకు సిల్ట్‌గ్రాబర్ వాహనం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. 15 నుంచి 25 అడుగుల లోతులో ఉన్న మ్యాన్‌హోళ్ల లోంచి మట్టి, వ్యర్థాలు తొలగిస్తుందన్నారు. మారేడుపల్లి డివిజన్‌కు ఒక సిల్ట్‌గ్రాబర్ వాహనాన్ని కేటాయించారని, అవసరమైన ప్రాంతాల్లో ఈ వాహనాన్ని ఉపయోగిస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నియమాల గురించి వివరిస్తున్న సీఐ శ్రీనివాసులు

చిలకలగూడ: జాతీయ భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన చిరువ్యాపారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తోపుడు బండ్లను రహదారులకు అడ్డంగా పెట్టి విక్రయాలు సాగించరాదని, కూరగాయలు, పండ్లు ఇతర ఆహార ఉత్పత్తులను తరలించే వాహనాలను పార్కింగ్ ప్లేస్‌లోనే నిలపాలని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు సూచించారు. రద్దీగా ఉన్న రహదారులపై వాహనాలు నిలిపితే ట్రాఫిక్ జామ్‌తోపాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అలుగడ్డబావి, హైదరాబాద్ టింబర్‌హౌస్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో విక్రయాలు సాగించే చిరువ్యాపారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌సీ అనీల్‌గౌడ్, పీసీ సత్యనారాయణ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రాయుధం.. వాడుకుందాం

- ఓటు హక్కును యువత సద్వినియోగం చేసుకోవాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో యువ ఓటర్లే కీలకమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన యువ ఓటర్ల సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రధాని వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని యువ ఓటర్లు విద్యార్థినులతో కలిసి వీక్షించారు. అనంతరం వారితో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్జీఓ సంస్థలు, విద్యా సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులంతా కలిసి కొత్త ఓటర్లను నమోదు చేయాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని, వివిధ రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు, ఎన్జీఓలు, విద్యా సంస్థలు భాగస్వాములు అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ సరళ, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్, సీనియర్ నాయకుడు నెమలి ఆనంద్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

కంటోన్మెంట్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మారేడుపల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన 'నమో నవ మత్‌దాత' కార్యక్రమాన్ని స్థానిక నేతలు, విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. మన దేశానికి యువత వెన్నెముక లాంటిదని, దేశ ప్రగతి అభ్యున్నతిలో యువతే కీలకమన్నారు. ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ నేతలు నరేశ్, సతీష్, వీరవర్ధన్, నాగభూషణం రెడ్డి యువ ఓటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

సనత్‌నగర్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఎన్నికలోనూ తాము ఓటు వేస్తామని విద్యార్థినులు, బోధన, బోధనేతర సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొ. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ తమ హక్కు, బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నరసింహులు, మధుకర్‌రావు, సరోజిని, సరిత, ప్రసన్న పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో..

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం తార్నాకలో నిర్వహించిన నమో నవ్ మత్ దాత(నూతనంగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు) కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావు పాల్గొని మాట్లాడారు. యువత ఆశలు, ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కారు ముందుకు సాగుతుందన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లందరూ దేశాభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు 5 వేలకు పైగా ప్రదేశాల్లో నవ ఓటర్ల సమ్మేళనం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, వీరన్న, బండ శివారెడ్డి, అయ్యప్పరెడ్డి, చరణ్, రాజు నేత, భరత్, హర్షిత పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుని మూడు రంగుల లైటింగ్‌తో అలంకరించిన సికింద్రాబాద్‌లోని రైల్వేస్టేషన్, రైల్ నిలయం మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో రాత్రి సమయంలో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. -సాక్షి సిటీబ్యూరో

27 నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శతచండీయాగ సహిత మహా కుంభాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహణ అధికారి కుంట నాగరాజు తెలిపారు. ఈ నెల 27వ తేదీ శనివారం నుంచి బుధవారం వరకు జరిగే మహోత్సవాలను జగద్గురువు ఆదిశంకరాచార్య కంచి కామ కోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ చేతుల మీదుగా మహోత్సవాలు ప్రారంభిస్తారన్నారు. 5 రోజుల పాటు దేవస్థానానికి చెందిన బోనాల కాంప్లెక్స్, కల్యాణ మండపం, వీఐపీ కాంప్లెక్స్‌లో ఉన్న భక్తుల గదుల కేటాయింపును రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు జెక్‌కాలనీలో ఫుడ్ ఫెస్టివల్

సనత్‌నగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మల్లుప్రసాద్, రాజశేఖర్ చందు ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం జెక్‌కాలనీ గాంధీ విగ్రహం వద్ద గణతంత్ర వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30 నుంచి 8 గంటల వరకు కాలనీ రోడ్డునెంబర్-1లో ఫుడ్ ఫెస్టివల్ రాత్రి 8 నుంచి 10.30 వరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద తంబోలా ఉంటుందన్నారు.

ప్రాచీన కట్టడంపై చెట్ల తొలగింపు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని నిజాం కాలం నాటి నిర్మాణం దర్వాజపై ఏపుగా పెరిగిన చెట్లను గురువారం తొలగించారు. ఈ మేరకు ప్రాచీన కట్టడంపై ఏపుగా పెరిగిన చెట్లతో నిర్మాణం పగుళ్ల బారి చెట్టు కూలిపోయే ప్రమాదం ఉందని సమస్యను వివరిస్తూ ఇటీవల సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమైనాయి. దీంతో స్థానికంగా ఉన్న డిప్యూటీ మేయర్ స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి ఆ నిర్మాణంపై ఉన్న చెట్టు, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్, నేతలు కిరణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాంగోపాల్‌పేట్: కళాసీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980-81 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు జీపీ పాల్గున, సాయి శ్రీనివాస్, రాఘవేందర్, గిరి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల కలయికతో పాటు వాసవి క్లబ్ సికింద్రాబాద్ సహకారంతో పాఠశాలకు అవసరమైన సుమారు రూ.5 లక్షల విలువ చేసే సామాగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పాఠశాల నిర్వహించిన స్పోర్ట్స్‌లో విజేతలకు షీల్డ్, ట్రోఫీలు కూడా అందిస్తామని చెప్పారు. పాఠశాలలో చదువుకున్న తాము వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డామని చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పూర్ణచందర్, కేపీ జగన్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో సర్వర్ డౌన్



బోసిపోయిన కౌంటర్లు

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో గురువారం సర్వర్ డౌన్ కారణంగా బ్యాంకింగ్ కార్యకలాపాలకు విఘాతం కలిగింది. బ్యాంకింగ్ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు కంప్యూటర్లు పనిచేయక అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా ఉద్యోగాలకు వెళ్లే సిబ్బంది కంప్యూటర్లు పనిచేయని కారణంగా తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

మిర్జాపూర్ పీజీ కాలేజీ
మూసివేతకు రంగం సిద్ధం

ఉస్మానియా యూనివర్సిటీ: సంగారెడ్డి జిల్లాలోని మిర్జాపూర్ బాలుర పీజీ కాలేజీ మూసివేతకు రంగం సిద్ధమైంది. ఓయూ పరిధిలో 43 ఎకరాలలో విస్తరించి ఉన్న మిర్జాపూర్ పీజీ కాలేజీ 1980లో స్థాపించారు. బోధన, బోధనేతర ఉద్యోగులతో పాటు తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, క్రీడా మైదానం, హాస్టల్ భవనం తదితర మౌలిక వసతులు గల మిర్జాపూర్ కాలేజీలో అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం వలన గత మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులు చేరడం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెస్సీ ఇన్ ఆర్గనిక్, ఫిజికల్ కెమిస్ట్రీ కోర్సులలో కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. విద్యార్థుల సంఖ్య లేనందున ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచి కాలేజీని మూసివేయాలని అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా కాలేజీని కొనసాగించాలని విద్యార్థి సంఘాల డిమాండ్‌తో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ఆర్గనిక్‌తో పాటు ఎంటీఏ, ఎంసీఏ కోర్సులను ప్రవేశ పెట్టి కాలేజీని కొనసాగించాలని జిల్లా పీజీ కాలేజీ డైరెక్టర్ ప్రొ.రవికుమార్ ఓయూ అధికారులకు లేఖ రాశారు.